# సింగిల్ పేజీ కథలు

**అప్పుడు సమయం రాత్రి 12 గంటలు. పిస్టల్ పేలిన శబ్దం. నిద్రలో ఉన్న నక్సలైట్లు తత్తరపడుతూ లేచి తమ ఆయుధాలు తీసుకొని శబ్దం వచ్చిన వైపుకి పరుగెత్తారు**

నెత్తురు మడుగులో పడి గిజగిజలాడుతున్న రాజాని చూశారు.

“రేయ్ రాజా! ఏంటిది.. ఎందుక్కాల్చుకున్నావ్?” ఆశ్చర్యంగా అడిగాడు నక్సలైటు నాయకుడు ప్రచండం.

“నిన్న మనం మందుపాత్ర పేల్చి చంపిన పోలీసుల్లో మా అన్నయ్య ఉన్నాడు. ఆ విషయం ఈరోజు పేపర్ ద్వారా తెలిసింది” అని తడబడుతున్న మాటలతో చెప్పలేక చెప్పలేక చెబుతున్నాడు రాజా.

ప్రచండం కూర్చొని రాజాని తన చేతుల్లోకి తీసుకున్నాడు. మిగతావాళ్లు రాజాకి సపర్యలు చేయబోయారు.

“నాకు సపర్యలు చేయకండి. కొద్ది నిమిషాల్లో చావబోతున్నాను” అని రాజా ఇంకా ఈ విధంగా చెబుతున్నాడు. “మా డాడీ చనిపోయిన దగ్గర నుండి మా అన్నయ్యే నన్ను ఎంతో గారంగా పెంచి చదివించాడు. తను పస్తులుండి నన్ను సాకాడు. నేను డాక్టరునై పేదలకు సేవ చేస్తుంటే చూడాలని కలలు కన్నాడు. అలాంటి అన్నయ్యను చేతులారా చంపుకున్నాను. ఇక ఈ నక్సలైట్ ఉద్యోగం చెయ్యదలచుకోలేదు. మనం చేసుకున్న రక్త ప్రమాణాలు మీరదలుచుకోలేదు. అందుకే... ఈ..ఈ.. ని..ర్ణ..యం.. తీ..”

ప్రచండం చేతుల్లో రాజా ఒరిగిపోయాడు. నక్సలైట్ల ఆచారం ప్రకారం రాజా అంత్యక్రియలు ముగిశాయి.

తన కుడిభుజం కూలినందుకు ప్రచండం ఆలోచనల్లో పడ్డాడు.

నాలుగు రోజుల్లో వస్తాను జాగ్రత్తగా ఉండండి అని సంఘసభ్యులకు చెప్పి ప్రచండం, బట్టల వ్యాపారి అవతారం ఎత్తి ఊళ్లో ప్రవేశించాడు.

లాడ్జిలో ఉంటూ, ఊళ్లో తిరిగి బట్టలమ్ముకుంటూ పోలీసు లైను వైపు వెళ్లి, చనిపోయిన పోలీస్ కుటుంబాల వివరాలు సేకరించే పనిలో పడ్డాడు ప్రచండం.

పోలీస్ లైన్లో బట్టలమూట ఒక ఇంటిదగ్గర చెట్టు కింద ఉంచి, ఇంటి ముందుకెళ్లి “అమ్మా! కొద్దిగా మంచి నీళ్లివ్వండి” అని అడిగాడు.

ఆ ఇంటినుండి ఏమీ సమాధానం రాలేదుగానీ పక్కింటినుండి ఒక ఆంటీ బయటికి వచ్చి “బాబూ.. మంచినీళ్లు నేనిస్తా రా, వాళ్లు దుఃఖంలో ఉన్నారు పాపం” అన్నది.

## జనజీవన స్రవంతి



“ఏంటమ్మా.. ఎందుకు దుఃఖం?” వినయంగా అడిగాడు ప్రచండం.

“వాళ్లబ్బాయ్ మొన్న చచ్చిపోయాడులే” అన్నది ఆంటీ లోగొంతుతో. “అయ్యో పాపం! ఎంతబ్బాయమ్మా?” జాలిగా అడిగాడు ప్రచండం.

“పెద్దబ్బాయే నాయనా! పోలీసు ఉద్యోగం చేస్తున్నాడు. మొన్న వరంగల్ దగ్గర నక్సలైట్లు మందుపాత్ర పేల్చి పోలీసుల్ని చంపారు. పేపర్లో కూడా వచ్చిందిగా. ఆ చచ్చిపోయిన పోలీసుల్లో వీళ్ల పెద్దబ్బాయ్ ఉన్నాడు. రెండోవాడు నక్సలైట్లతో కల్సిపోయాడు. వాడి పేరు రాజా. చదువులో ఫస్టు. గోల్డ్‌మెడల్ కూడా వచ్చింది. ఉద్యోగమే రాలా. ఉద్యోగం కోసం ఎన్నో ప్రయత్నాలు చేసి విసుగు పుట్టి, నక్సలైట్లతో కల్సిపోయాడు.”

ఆంటీ చెబుతుంటే ప్రచండం వింటున్నాడు.

“చనిపోయిన ఆయనకి పిల్లలెంతమంది?” మృదువుగా అడిగాడు ప్రచండం.

“మూడేళ్ల పాప... ఆ తల్లి ఇప్పుడు మళ్లీ నిండు కడుపుతో ఉంది. కొడుకు మరణవార్త తెలిసి తల్లి కోమాలోకి వెళ్లింది. ఇప్పుడామె ఆసుపత్రిలో ఉంది. ఆమె కూడా దక్కిందాక నమ్మకం లేదు” చెప్పటం ఆపింది ఆంటీ.

“అయ్యో పాపం!” అంటూ ప్రచండం “వెళ్లొస్తానమ్మా” అని తన మూట ఎత్తుకొని లాడ్జికి వెళ్లిపోయాడు.

లాడ్జిలో తన రూంలో కూర్చొని ఏదో ఆలోచిస్తున్నాడు ప్రచండం. ప్రక్క రూంలో నుండి మాటలు వినిపిస్తున్నాయి.

తండ్రి కొడుకుల సంవాదం.

“శీనూ! పోలీసుద్యోగం కోసం ప్రయత్నం చేయాలని ఈ ఊరొచ్చావ్. చూశావుగా పోలీసుల అగచాట్లు. వేరే ఉద్యోగం కోసం ప్రయత్నించరాదూ..” అన్నాడు తండ్రి.

“ఏంటి నాన్నా అలా అంటావ్. ఎక్కడో ఏదో జరిగిందని కీడునే ఆలోచిస్తూ కూచుంటే ఎలా? నేను పోలీసుద్యోగానికే ట్రయ్ చేస్తాను!” ఆవేశంగా మాట్లాడుతున్నాడు కొడుకు.

“ఇదిగో పేపర్ చూశావుగా. చనిపోయిన పోలీసుల్లో ఓ పెళ్లికొడుకు కూడా వున్నాడట. వారం రోజుల్లో పెళ్లట. వాళ్లది ప్రేమ పెళ్లి. ఆవేశంలో తొందరపడ్డారు. ఫలితంగా అమ్మాయి నెల తప్పింది. అందుకని ముహుర్తాలు పెట్టుకున్నారు. తనకు కాబోయే భర్త మరణ వార్త విని ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది” అన్నాడు తండ్రి.

ఈ వివరాలు తెలుసుకుంటున్న ప్రచండానికి తల తిరిగినంత పనైంది. అన్ని వివరాలు తెలుసుకున్న ప్రచండం, అడవి బాట పట్టి తన ముఠాను చేరుకున్నాడు. నాలుగు రోజులుగా తను సేకరించిన విషయాలన్నీ తన సంఘ సభ్యులకు వివరించాడు.

తెల్లారేసరికి ప్రచండం లేడు. చీటీ మాత్రం రాసి పెట్టి ఉంది. ఎన్ని వేలమంది పోలీసుల్ని చంపినా మన రాజ్య స్థాపన జరగదని నాకు నమ్మకం కలిగింది. అందుకే, నేను జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని నిర్ణయించుకున్నాను. మిమ్మల్ని కలవమని నేను అనను. మీ సిద్ధాంతాలు, నమ్మకాలు మీవి. అది మీ ఇష్టం.

-ఇట్లు,
ప్రచండం.

నక్సలైట్లు ఆలోచనలో పడ్డారు.

**-కొండా రామారావు** (హైదరాబాద్)